ప్రజాశక్తి

గురువారం 11 జులై 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గొంతెత్తిన కార్మికులు

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో డిమాండ్ డే జయప్రదం
- ఎక్కడికక్కడ నిరసనలు, ధర్నాలు, మానవహారాలు
- కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం : సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

సిఐటియు అఖిలభారత కమిటీ పిలుపు మేరకు బుధవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో డిమాండ్స్ డే నిరసనలు చేపట్టారు. డిమాండ్లపై నినదించారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన కోర్కెల దినం సందర్భంగా నిరసన తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మెజార్టీని కోల్పోయి మూడోసారి అధికారంలోకి వచ్చినా కార్మిక వ్యతిరేక విధానాల నుంచి వెనక్కుతగ్గలేదన్నారు. కార్మిక చట్టాలను లేబర్‌కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను హరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ప్రావిడెంట్ ఫండ్ చెల్లించని యజమానికి 25 శాతం ఫెనాల్టీ ఉండేదని, ఇప్పుడు దానిని 5 శాతానికి తగ్గించడాన్ని తప్పుపట్టారు. యజమానులు పిఎఫ్ చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు అవకాశాలు కల్పించడమేనని పేర్కొన్నారు. యజమానులకు అనుకూలంగా గతంలోనే రూ.11.4 లక్షల



డిమాండ్ డే నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

కోట్లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాయితీలిచ్చి యజమానుల పక్షాన, ధనవంతుల పక్షాన వ్యవహరించిన తీరును సిఐటియు తీవ్రంగా

మిగతా 2లో..

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి : వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై తమ వైఖరిని బహిర్గతం చేయాలని కోరారు. ప్రస్తుత ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాకముందు చేపట్టిన యువగళం యాత్రలో వ్యవసాయ పంపుసెట్ల స్మార్ట్ మీటర్లును ధ్వంసం చేయాలని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ నిర్ణయాన్నే అమలు చేయడమంటే రైతులను మోసం చేయడమేనని పేర్కొన్నారు.

ఒకసారి విద్యుత్ మీటర్ బిగించడమంటూ జరిగితే దానికి బిల్లులు వస్తాయని, రైతు మీద

మిగతా 2లో..



వార్తలు7లో...

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లు పరిశీలన

చంద్రబాబు పర్యటనతో కొత్త ఆశలు

- నేడు దార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పరిశీలన
- నిధుల్లేక ముందుకుసాగని సుజల స్రవంతి పనులు
- పునరుద్ధరణకు నోచని మూతపడ్డ సుగర్ ఫ్యాక్టరీలు
- కొనసాగుతున్న ఎన్ఎఒబి నిర్వాసితుల పరిహార సమస్య
- విశాఖ-చైన్నై కారిడార్ నిర్వాసితులకు అందని మెరుగైన ప్యాకేజీ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం తొలిసారి పర్యటనతో ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద పోలవరం ఎడమకాలువ పనుల పరిశీలనతో పనులకు మోక్షం కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. 84 కిలోమీటర్ల ఎడమ కాలువ పనుల్లో జాతీయ రహదారి క్రాసింగ్, బ్రిడ్జిలు, అక్విడెక్ట్, కాంక్రీట్ పనులు నిధులు సరిపడా విడుదలచేయక ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయాయి. నిధుల్లేమితో ప్రధాన ఎడమ కాలువతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 8 లక్షల ఎకరాల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని మూడు లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగే బాబూ జగ్జీవన్‌రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు ముందుకుసాగడంలేదు.

2017 సెప్టెంబరు 5న టిడిపి ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టు ఫేజ్-1 కింద తొలిదశ పనులు పూర్తిచేసి అనకాపల్లి జిల్లాలోని 9 మండలాల్లో 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి రూ.2022 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరుచేస్తూ జిఒ 53 విడుదల చేసింది. అయినా నిధులు విడుదల చేయలేదు. తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వ కాలంలో అదే నిర్లక్ష్యం కొనసాగడంతో సుజల

మిగతా 2లో..

షెడ్యూల్ ఇలా...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం విశాఖ పర్యటనకు విచ్చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటసారిగా విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో పర్యటనకు విచ్చేస్తున్న సిఎంకు ఘన స్వాగతం పలికేందుకు అధికార యంత్రాంగం, అధికార తెలుగుదేశం, కూటమి పార్టీలకు చెందిన జనసేన, బిజెపి కార్యక్రమాలను రూపకల్పన చేశాయి. గురువారం రోజంతా చంద్రబాబు షెడ్యూల్ బిజీతో నిండిపోనుంది. ఉదయం 10గంటలకు ఉండవల్లి నివాసం నుంచి బయల్దేరుతారు. మధ్యాహ్నం 11.50గంటలకు అనకాపల్లి జిల్లాలోని దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 1.30గంటలకు భోగాపురం ఎయిర్ పోర్టును సందర్శించి పనులను పర్యవేక్షించనున్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో పర్యటన...

చంద్రబాబు మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4.30 గంటల వరకూ సిఐఐ కాన్ఫరెన్స్‌లో వర్చువల్‌గా పాల్గొంటారు. పెదగంట్యాడలోని మెడికల్ డివైసెస్ పార్క్ (మెడ్ టెక్ జోన్) వర్కర్లతో సమావేశం కానున్నారు. సాయంత్రం 4.50 నుంచి 6గంటల వరకూ ఎయిర్ పోర్టు లాంజ్‌లో అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. గడచిన

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గొంతెత్తిన కార్మికులు

ఖండిస్తున్నదన్నారు. కొత్త పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, కనీసవేతనం రూ.26 వేలు, ఇపిఎస్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానం రద్దుచేసి కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్‌పరం అయితే నిరుద్యోగం మరింత పెరిగే ప్రమాదముందన్నారు. కేంద్ర బిజెపితో అధికారం పంచుకున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కూడా మోడీ విధానాలను వ్యతిరేకించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఆఫీస్‌బేరర్స్ పి.మణి, కెఎం.కుమారమంగళం, మున్సిపల్ యూనియన్ నాయకులు యు.రాజు, టి.నూకరాజు, జెఆర్.నాయుడు, ఆటో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, రమణ, హాస్పిటల్స్ యూనియన్ నాయకులు పి.వెంకటరావు, ఆర్‌టిసి యూనియన్ నాయకులు వి.తులసీరాం, పెన్షనర్స్ నాయకులు కె.సుధాకర్, ముఠా యూనియన్ నాయకులు ఎం.సుబ్బారావు, వై.రాజు, కెవిపి.చంద్రమౌళి, తోపుడుబండ్ల సంఘం నాయకులు కె.కుమారి, ఎ.సింహాచలం, అనపర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి:డిమాండ్స్ డే కార్యక్రమం అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం నిర్వహించారు. ఆర్డీవో చిన్నికృష్ణకి డిమాండ్ల పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, పలు రంగాల నాయకులు బీశెట్టి అప్పారావు, గ్రైపూరి నర్సింగరావు, కే అప్పారావు, రాజు, ఎం అప్పలరాజు, చెన్నారావు, సంధ్య, మల్ల లక్ష్మి, రాము, లక్ష్మణ్, శంకర్రావు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: డిమాండ్ డే లో భాగంగా ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మిక సంఘం ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, నిత్యం రోడ్లపై పనులు చేస్తూ జీవిస్తున్న హమాలీ కార్మికులకు నేటికీ సమగ్ర చట్టం లేదన్నారు. ప్రమాద భీమా సౌకర్యం లేక అనేక మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, డివిజన్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, ముఠా కార్మిక సంఘం ప్రెసిడెంట్ రుత్తల గోవింద్, కె.నానాజీ, రాము, అప్పారావు, నాయుడు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ పర్యటనకు విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజుకు విశాఖ విమానాశ్రయంలో కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రులకు శాలువా వేసి సన్మానించారు. అనంతరం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ లోకసభ ఎంపీ భరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి..

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ అంటూ ఖాతాల్లో మొదట్లో మొత్తాన్ని వేసిందని, మరి ఇప్పుడు ఎలా వేస్తుందో అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. విద్యుత్ మీటర్ల విషయంలో కూడా ఇలాంటి అనుభవమే ఎదురవుతుందని రైతాంగం ఆందోళన చెందుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ మీటర్లు ఏర్పాటుకయ్యే వ్యయాన్ని కూడా రైతాంగం నుంచి వివిధ రూపాల్లో చార్జీల క్రింద వసూళ్లు చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్మార్ట్‌మీటర్లు అదానీ, షిరిడిసాయి కంపెనీలకు లాభాల కోసం తప్ప రైతాంగం ప్రయోజనాలకు కాదని ఎద్దేవాచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను నిలుపుదల చేయాలని, లేదంటే గత ప్రభుత్వానికి ప్రజలు ఏ విధమైన గుణపాఠం చెప్పారో ఈ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని హెచ్చరించారు.

చంద్రబాబు పర్యటనతో కొత్త ఆశలు

స్రవంతి పనుల్లో పురోగతిలేదు. నిధుల్లేక ప్రాజెక్టు పనులకు అవసరమైన భూ సేకరణ చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నక్కపల్లి మండలంలో విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ భూములు కోల్పోయిన ఐదు పంచాయతీలు, 11 గ్రామాల నిర్వాసితులకు పరిహారం, మెరుగైన ప్యాకేజీ, పునరావాస సమస్య తీరలేదు. నక్కపల్లి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్ లేక ప్రమాద బాధితులు మృత్యువాతపడుతున్నారు. తాండవ, ఏటికొప్పాక, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలు ఆధునీకరించి పునరుద్ధరణపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తుందన్న ఆశ రైతుల నుంచి వ్యక్తమవుతోంది. ఎన్ఎఓబి నిర్వాసిత మత్స్యకారులకు బోట్ల పరిహారం ఇప్పటికీ పరిష్కారంకాలేదు. ఉపాధి కోల్పోయిన బాధిత నిర్వాసితులకు సంపూర్ణంగా ప్యాకేజీ చెల్లించలేదు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో ఫిషింగ్ హార్బర్, నక్కపల్లి మండలం రాజయ్యపేట, దొండవాకలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. తాండవ,పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల మరమ్మతులు గత ఐదేళ్లుగా చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందించలేని పరిస్థితి ఉంది.

షెడ్యూల్ ఇలా...

ఐదేళ్లలో నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్ష చేపడతారు. 7.45గంటలకు ఉండవల్లి తన నివాసానికి చేరుకుంటారు.

వైజాగ్ పోర్టు అధికారులతోనూ సమీక్ష...

విశాఖ పోర్టు ట్రస్ట్ (విపిటి) అధికారులతో ఎయిర్ పోర్టు లాంజ్‌లో ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్న పనులపై సమీక్షించనున్నారు. కేంద్ర ఫిషింగ్ శాఖా కార్యదర్శి రాజీవ్ రంజన్ సింగ్ ఈ సమీక్షలో చంద్రబాబుతో పాటు పాల్గొంటారు. పోర్టు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

గరీబ్‌రథ్‌కు నూతన ఎల్‌హెచ్‌బి కోచ్‌లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ప్రయాణికుల సౌకర్యం, భద్రతను పెంపొందించే లక్ష్యంతో భారతీయ రైల్వేలు సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌ను ఆధునిక లింకే హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బి) కోచ్‌లుగా మార్చనున్నామని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. 12740 సికింద్రాబాద్-విశాఖపట్నం గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22 నుంచి, 12739 విశాఖపట్నం-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి నూతన ఎల్‌హెచ్‌బి కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ కొత్త రేక్‌లో 3వ ఏసి ఎకానమీ కోచ్‌లు 18, జనరేటర్ మోటార్ కార్లతో 2తో సహ 20 ఎల్‌హెచ్‌బి కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కోచ్‌లు మెరుగైన భద్రతా ఫీచర్లు, వేగ సామర్థ్యం కలిగి ఉన్న కారణంగా ప్రయాణ సమయాలు తగ్గిస్తాయని తెలిపారు.

క్యారమ్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ డివిజనల్ స్థాయి క్యారమ్ సెలక్షన్స్ బుధవారం ఎల్ఐసి స్పోర్ట్స్ క్లబ్‌లో ముగిశాయి. ఈ సెలక్షన్స్‌లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయాలలో పనిచేస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఎంపికలలో పురుషుల విభాగంలో కె.శ్రీనివాసరావు, కె.అవినాష్, లెనిన్‌బాబు, మహిళల విభాగంలో జివి.పద్మావతి, ఆర్‌వి.పద్మావతి, హారిక ఎంపికయ్యారు. వీరు ఆగస్టు 28, 29న కడపలో జరిగే జోనల్ పోటీలకు అర్హత సాధించారని అధికారులు తెలిపారు. ఎంపికైన వారికి ఎల్ఐసి డివిజన్ మేనేజర్ (పర్సనల్) రామారావు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిఎస్‌వై.శర్మ, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు ప్రకటన చేయాలి

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టి గురువారం విశాఖపట్నం వస్తున్న సందర్భంగా ప్లాంటు రక్షణకు ప్రకటన చేస్తారని విశాఖ ఉక్కు కార్మికులు, విశాఖ ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ నిర్ణయానికి మద్దతుగా కేంద్ర బిజెపికి సహకరించడానికి చంద్రబాబు సానుకూలత తెలిపినట్లు వివిధ పత్రికల్లో వార్తలు చూసి కార్మికులు, ప్రజలు తీవ్ర ఆందోళనతో ఉన్నారని, ఈ ఆందోళనను నివృత్తి చేస్తూ స్టీల్ ప్లాంట్ రక్షణ, అభివృద్ధి బాట పట్టించేందుకు అనుకూలమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ చిన్ని కుమారి లక్ష్మి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 2,3 వార్డుల పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం యూనిఫాం పంపిణీ చేశారు. బ్యాంక్ కాలనీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి యూనిఫాం అందజేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి రాధా కుమారి, ఉపాధ్యాయులు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు

మూడో వార్డు ఉన్నత పాఠశాల, రెల్లివీధి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండయూనిఫాంలు అందజేశారు కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు

తగరపువలస :భీమిలి మండలం,మజ్జివలస ఎంపిపి పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ టి ఆదిలక్ష్మి, ఎంఇఒ ఎం.శివరాణి, సమగ్ర శిక్ష ఎఎంఒ లక్ష్మి, హెచ్ఎం ఎల్.కనకే శ్వరరావు పాల్గొని యూనిఫాంలు పంపిణీ చేశారు అంతకు ముందు 'నేను బడికి పోతా'పేరిట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను ఎంఇఒ శివరాణి కోరారు

ఆరిలోవ :తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఏకరూప దుస్తులు, పుస్తకాలు, బ్యాగ్‌లను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ఎమ్మెల్యే వెలగపూడి కోరారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, వార్డు టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, హెచ్ఎం జివిడికె భవాని పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా విస్తృత సేవలు

ప్రజాశక్తి-తగరపువలస : ఇండియా అడ్వర్టైజింగ్ సర్వీసెస్ కంపెనీ (లండన్) సంస్థ ద్వారా ఛారిటబుల్ ట్రస్టులను ఏర్పాటు చేసి, విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ సౌత్ ఇండియా డైరెక్టర్ కొయ్య అప్పలరెడ్డి తెలిపారు. భీమిలి మండలం లక్ష్మీపురం జంక్షన్‌లో సంబంధిత కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ సంస్థ ద్వారా పేదలకు వివిధ రూపాల్లో సేవలు అందించనున్నట్లు వివరించారు. వర్క్ ఫ్రమ్ హోం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు కార్యక్రమంలో స్థానిక బ్రాంచి రీజినల్ ఆఫీస్ డైరెక్టర్ కాళ్ల సురేష్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల పంపిణీలో అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని వేములవలస జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీలో అవకతవకలపై విచారణ జరిపించాలని వేములవలస వార్డు సభ్యుడు కోరాడ దామోదర్ బుధవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.వేములవలస సర్వే నెంబరు 152 /1 లో సుమారు 100 మందికి ఇళ్ల స్థలాలు మంజూరుచేస్తే, వాటిలో చనిపోయిన అనర్హులకు పట్టాలిస్తే, అర్హులైన వారిని విచారించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు ఇళ్లస్థలాలను కలుపుకుని ఒకే ఇంటిని నిర్మిస్తున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

- ఏపి పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్



మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ నేత

ప్రజాశక్తి -ములగాడ : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం ఉధృతం చేయాల్సిన అవసరం ఉందనిఏపి పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ స్పష్టం చేశారు. బుధవారం వెంకన్నపాలెం సిఐటియు ఆఫీసులో పారిశ్రామిక ప్రాంత ఎపిఆర్‌పిఎ సంఘం నెలవారి సమావేశం జరుపుకున్నారు ముందుగా ఇటీవల మరణించిన అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి చుక్క సత్యనారాయణ రాజు, ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగి అప్పల స్వామి, షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగి పిఎస్ఎన్ రెడ్డి మర ణాలకు సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు.

అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు కె.నూకరాజు మాట్లాడుతూ, గత రెండు నెలలుగా ఎండ తీవ్రత వల్ల సమావేశాలు సరిగ్గా జరగలేదని, ఇకనుంచి ప్రతినెలా సమావేశాలకు తప్పక హాజరు కావాలని కోరారు.షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులకు రావలసిన 2శాతం బకాయిలపై మరో పోరాటానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. .జిల్లా కార్యదర్శి ఎస్.కె హుస్సేన్ గారు మాట్లాడుతూ ఎపిసిసి పిలుపుమేరకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరగనున్న సమయంలో వచ్చేనెల 6,7, 8 తేదీలలో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మూడు రోజుల ధర్నాకు ఆరోగ్యం సహకరించిన సభ్యులందరూ హాజరు కావాలని కోరారు ఇప్పటికే విశాఖ జిల్లానుంచి వివిధ సంస్థలకు చెందిన 16 మంది రిజర్వేషన్ చేసుకున్నారన్నారు. ఎంపీలకు వినతిపత్రం అందజేసి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆందోళన సాగుతుందన్నారు. కేరళ, హరియాణా తరహాలో ఏపీలోనూ ఇపిఎఫ్ పెన్షనర్లకు ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఆర్థికసాయం రూ.నాలుగు వేలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అంద జేస్తామన్నారు. నూకరాజు అధ్యక్షత వహించిన సమావేశంలో సిహెచ్ తమ్మారావు మాట్లాడారు. ఢిల్లీ జంతర్‌మంతర్ ఆందోళన కు కొందరు సంసిద్ధత వ్యక్తం చేయగా, మరికొందరు వెళ్లేవారికి ఆర్థికసాయం అందించేందుకు ముందుకు రావడంపై వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా రెండవ విజయరామరాజు సంస్మరణ

ప్రజాశక్తి -పద్మనాభం:.మండల కేంద్రమైన పద్మనాభంలో రెండవ విజయరామరాజు.సమాధి వద్ద బుధవారం మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు ఆధ్వర్యంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు .విజయరామరాజు సమాధి వద్ద పూలమాలలు, పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు కుంతీమాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి అప్పలనరసింహరాజు మాట్లాడుతూ, 1993 జూలై 10న తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రభుత్వం తరపున ద్విశతాబ్ది వేడుకలను నిర్వహించి, చారిత్రక ఈ సమాధులను వెలుగులోకి తెచ్చానన్నారు. ఈ స్థలం దురాక్రమణకు గురికాకుండా నాటి ఎంపీ ఎంవివిఎస్ మూర్తి సమకూర్చిన నిధుల రెండవ విజయరామరాజు స్మారక సామాజిక భవనాన్ని నిర్మించామన్నారు. అలాగే ఇక్కడి రోడ్డు మార్గం కూడా ఏర్పాటు చేశామన్నారు. నాటి చరిత్ర, సంస్కృతులు భావితరాలకు తెలియజేయాలంటే వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు కె రమణ, మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు, ఎంపిటిసి ఎ.లక్ష్మునాయుడు, వై.నరసింగరావు, కాళ్ల సత్యనారాయణ, కాళ్ల శ్రీను పాల్గొన్నారు.

ఎస్‌బిసి బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : డాక్‌యార్డ్ రహదారిలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ (పార్లర్) బ్రిడ్జిను మరమ్మత్తుల కోసం కొన్ని నెలలు వాహనాల రవాణాను ఆపి వేస్తున్నారని, ఈ బ్రిడ్జి ప్రక్కనే రక్షణ రంగానికి సంబంధించిన షిప్ బిల్డింగ్ సెంటర్ బ్రిడ్జి ఉందని, పార్లర్ బ్రిడ్జి మరమ్మతులు పూర్తయ్యేంత వరకు తగిన రక్షణ చర్యలు చేపట్టి ఎస్‌బిసి బ్రిడ్జిపై ప్రజల వాహనాల రాకపోకలకు అనుమతించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు, పి.పైడిరాజు కలెక్టర్‌ను కోరారు. గాజువాక నుండి సింథియా వరకు సుమారు 2 లక్షల మంది ప్రజలు ఉన్నారని, రక్షణరంగం, షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, ఐఒసి, ఎపిసిఎల్, కోరమండల్, అనేక గోడౌన్స్‌లో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నా రని తెలిపారు. ప్రమాదాలు జరిగినా, గుండె నొప్పులు, గర్భిణుల ప్రసవాలు, ప్రజల అత్యవసర వైద్యానికి నగరంలోని ఆసుపత్రులకు వెళ్లాలంటే సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జ్ ఉపయోగపడు తుందని వివరించారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణాలతో పాటు సకాలంలో డ్యూటీలకు వెళ్లేందుకు ఈ రహదారి కీలకంగా ఉందన్నారు. డాక్ యార్డు గొడౌన్స్ మారుతి జంక్షన్ మీదుగా నగరంలోకి ప్రత్యామ్నాయ రహదారిలో వెళ్లాలంటే 6 కిలోమీటర్లు అదనపు ప్రయాణం చేయాలని వివరించారు. ఈ మార్గంలో 3 రైల్వే క్రాసింగ్‌లున్నా యని తెలిపారు. తగు రక్షణ చర్యలతో ఎస్‌బిసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

సెంట్రల్ పార్క్‌లో వియంఆర్‌డిఎ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: సెంట్రల్ పార్కులో వియంఆర్‌డిఎ కమిషనర్ రవీంద్ర బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పాడైన చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్‌ను, సైన్ బోర్డులను సాధ్యమైనంత త్వరగా బాగుచేయించాలని, వ్యర్థాల నిర్వహణ త్వరితగతిన చేపట్టాలని, నడక దారిలో పాడైన టైల్స్‌ను రీప్లేస్ చెయ్యాలని అధికారులకు సూచించారు. సిఇ భవానీశంకర్, ఎస్ఇ బలరామ రాజు, ఇఇలు ఎస్‌విఎస్ఎన్. రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, డిఇ మురళీకృష్ణ, ఎఇఇ బేగం పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్ అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అవినీతి, జివిఎంసికి రూ.వేల కోట్లు గండికొట్టిన నిర్ణయాలు, వ్యవహారాలపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఘోరఓటమి తరవాత కూడా కేవలం లంచాల కోసం వైసిపి నేతల పనులకుప్రాధాన్యతనిచ్చి అనుమతు లు మంజూరు చేశారన్నారు. మద్రిపాలెంలో కరన్ ఉద్యోగ్ డెవలపర్స్ సంస్థ 4 ఎకరాలకు, పరవాడలో ప్రకృతి ఎవిన్యూ సంస్థకు చెందిన 9 ఎకరాలకు, అనకాపల్లి కొప్పాక వద్ద వివిపై సంస్థకు, సుజాతనగర్‌లో ప్రభుత్వ స్థలంలో చేస్తున్న నిర్మాణానికి అనుమతులిచ్చారన్నారు.

నేరాలు ఘోరాలు

12 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని వడ్డిప గ్రామ శివారులో రత్నంపేట వస్తున్న ఆటోని తనిఖీలు చేయగా 12 కేజీల గంజాయి పట్టుబడినట్లు కొత్తకోట సిఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ కేసులో ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నామన్నారు. ఎస్సై సురేష్ ఎంతో చాకచక్యంతో ఈ కేసును ఛేదించారన్నారు. పట్టుబడిన వ్యక్తుల్లో ముగ్గురు అల్లూరి జిల్లా చింతపల్లి, జి.మాడుగుల మండలం చెందిన వారని, మిగిలిన ముగ్గురు బెంగుళూరు చెందిన వ్యక్తులని గుర్తించామన్నారు. బెంగళూరు చెందిన వ్యక్తులు చింతపల్లిలో గంజాయిని కొని తుని వెళ్లేందుకు ఆటో బుక్ చేసుకొని వెళుతుండగా మార్గమధ్యలో పోలీసులు పట్టుకోవడం జరిగిందని ఆయన వివరించారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పట్టుబడిన 11మంది మందుబాబులకు భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి సౌజన్య ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున అపరాధ రుసుము విధిస్తూ తీర్పు చెప్పారని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు.

తప్పుడు ఫిర్యాదుపై చర్యలకు వినతి

ప్రజాశక్తి-పద్మనాభం: పిత్రార్జితంగా వచ్చిన తన భూమిపై ఎటువంటి హక్కులు లేవని అధికారులకు తప్పుడు ఫిర్యాదు ఇచ్చి తప్పుదోవ పట్టించడమే కాకుండా, తమపై అసత్య ఆరోపణలు చేస్తున్న .మండలంలోని బుడ్డివలస విఆర్ఎ సింహచలంపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన బోని గౌరి కోరారు. ఆర్‌డిఒకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-తగరపువలస : స్థానికంగా ఉన్న ఒక ప్రయివేటు ఎరువుల దుకాణాన్ని రంపచోడవరం వ్యవసాయ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, విశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఆర్ రవిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అగ్రికల్చర్ ఇన్‌పుట్స్ నాణ్యతా ప్రమాణాలు, ధరల నియంత్రణ పర్యవేక్షణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేసిన అధికారుల బృందం, దుకాణంలోని పలు డాక్యుమెంట్లతో పాటు అమ్మకానికి నిల్వ ఉంచిన సరుకుల పరిమాణము, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. నిబంధనలకు లోబడి వ్యవసాయ శాఖ సూచనల మేరకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు నిర్వహణ కచ్చితంగా చేపట్టాలని, ఎరువులు కొనేవారికి విధిగా సంతకాలతో కూడిన రశీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో భీమిలి ఎఒ బి శివకోమలి, టెక్నికల్ వ్యవసాయశాఖ అధికారి పి శ్రీకాంత్ పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం సబ్ స్టేషన్ మామిడిలోవ 11 కెవి విద్యుత్ లైన్ నిర్వహణ పనుల నేపథ్యంలో ఈనెల 11న గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకురామవరం, జి.ఎస్.అగ్రహారం , మామిడి లోవ, గండిగుండం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు.

రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల

మండలంలోని పరదేశిపాలెం, వెల్లంకి సబ్‌స్టేషన్ల పరిధిలోని 33/11కెవి విద్యుత్‌లైన్ల నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 12న శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎఇఇ సురేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. బోయపాలెం, గంభీరం, ఎపిఐఐసి, కొత్తకల్లవానిపాలెం, వెల్లంకి, బొడ్డపాలెం, గొరపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 32వ వార్డు గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలోని వెంకట గౌరీశంకర్ గ్రంథాలయానికి ఆ వార్డు జనసేన కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు 25 కుర్చీలను బుధవారం విరాళంగా ఇచ్చారు. 2022 - 23లో గౌరీ పరమేశ్వరుల మహోత్సవంలో అప్పటి సంఘ ప్రెసిడెంట్ భీశెట్టి శ్రీను, సెక్రటరీ శరగడం మోహనరావు, ఇప్పటి పాలకవర్గం కమిటీ మెంబర్ దొడ్డి రాంబాబు, సభ్యుడు కాండ్రేగుల రాము తదితరుల సమక్షంలో ఇచ్చిన మాట ప్రకారం వీటిని ఇచ్చానని కందుల నాగరాజు తెలిపారు. దక్షిణ నియోజకవర్గ జనసేన కందుల కేదార్ నాథ్, కందుల బదరీనాథ్, మద్ది రాజశేఖర్, కుమారి, నాగేంద్ర, నళిని దేవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ శ్రీభరత్
- కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి పర్యటన నేపథ్యంలో ఉక్కు సిఎండి అతుల్‌భట్‌తో భేటీ .. పలు అంశాలపై చర్చ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు టిడిపి కట్టుబడి ఉందని, దీనిపై మారుమాట లేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ మార్గాని శ్రీభరత్ స్పష్టం చేశారు. కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్‌కు వస్తున్న నేపథ్యంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ స్థితిగతులను అంచనా వేయటానికి ఉక్కు సిఎండి అతుల్‌భట్‌తో బుధవారం భేటీ అయ్యారు.పలు అంశాలపై సుమారు రెండు గంటల పాటు చర్చలు జరిపారు. అనంతరం ఉక్కు హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ముందుకు కొనసాగాలంటే కనీసం రూ.మూడు వేల కోట్లను కేంద్రప్రభుత్వం సహాయంగా అందించాలని కుమారస్వామిని అడగ నున్నట్లు తెలిపారు. మిగులు భూములు అమ్మితే సుమారు రూ.వెయ్యి కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందని ఎంపీ శ్రీభరత్‌కు సిఎండీ వివరి ంచారు.. రాష్ట్ర ప్రభు త్వం నుంచి ఎటువంటి సహకారం కావాలని ఉక్కు సిఎండిని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అడిగారు. దీనిపై స్పందిస్తూ, గర్భం, సారిపల్లి మైన్స్‌కు స్టీల్‌ప్లాంట్‌కు లీజు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని సిఎండి కోరారు. అలాగే సమయానికి కార్మికుల జీతభత్యాలు చెల్లించేలా చూడాలని సిఎండిని ఎమ్మెల్యే పల్లా కోరారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి మొదటి నుంచి టిడిపి కృషి చేస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్టీల్‌ప్లాంట్ అమ్మకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టడంలో టిడిపి ముందుంటుందన్నారు

ఎంపీ మార్గాని శ్రీభరత్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్త అవాస్తవమన్నారు. ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్‌ను కొనసాగించడంతోపాటు లాభాల బాట పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరవున అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కేంద్రం నుంచి అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని, దీనికోసం కేంద్ర ఉక్కుమంత్రిని గురువారం కలిసి కోరనున్నట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం కార్మికులకు, నిర్వాసితు లకు న్యాయం జరిగేలా టిడిపి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె ఎస్ ఎన్ రావు, వర్నాల శ్రీనివాసరావు, రామస్వామి, వైటీదాస్ పాల్గొన్నారు



ఉక్కు సిఎండితో భేటీ అయిన టిడిపి నేతలు

పోలీస్‌స్టేషన్‌లోని వాహనాల తరలింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



వాహనాలను తరలిస్తున్న సిఐ విజయకుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద పేరుకుపోయిన సీజ్ చేసిన వాహనాలను బుధవారం వేరే ప్రాంతానికి తరలించారు. పోలీసుస్టేషన్ ఆవరణలో నిండుకున్న వాహనాలతో ఫిర్యాదుదారులతోపాటు ఇక్కడి సిబ్బంది పడుతున్న ఇబ్బందులపై ఈనెల 9న. మంగళవారం ప్రజాశక్తి దినపత్రిలో 'పోలీస్‌స్టేషన్ వాహనాలమయం' శీర్షికతో వెలువడిన కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. నాలుగోపట్టణ సిఐ ఎస్.విజయకుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని, స్టేషన్ పరిసరాల్లో ఉన్న అన్ని సీజ్ చేసిన వాహనాలను ప్రత్యేక వాహనంలో వేరే ప్రాంతానికి తరలించారు. స్టేషన్ చుట్టూ ఖాళీ కావడంతో వచ్చే ఫిర్యాదుదారులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని సిఐ విజయకుమార్ తెలిపారు. కాగా పోలీస్‌స్టేషన్ చుట్టూ పేరుకుపోయిన తుప్పు వాహనాల తొలగింపుతో పలువురు హర్షం వ్యక్తం చేసున్నారు.

కాపుల సంక్షేమానికి కృషి



గణబాబును సత్కరిస్తున్న కాపు సంఘం నేతలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : కాపు సామాజిక వర్గం అభివృద్ధి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని శాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గోపాలపట్నం కాపు సంఘం అధ్యక్షుడు కంచిపాటి చంటి ఆధ్వర్యంలో సంఘం నేతలు ఎమ్మెల్యే గణబాబును ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాపులకు సామాజికభవనం, విదేశీవిద్యకు స్కాలర్‌షిప్‌లు, ఆర్థికసాయం నిరుపేదలకు ఇళ్లు, ఇతర సమస్యలను విన్నవించగా, వాటిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గణబాబు, ఇటీవల ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన కాపులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గోపాలపట్నం కాపు సంఘం నేతలు బి. నరసింగనాయుడు, నారిపిన్ని సత్తిరాజు, రాళ్ల బండి నాగేశ్వరరావు, పతివాడ అప్పన్న ముక్క శివాజీ, కంచిపాటి అప్పలరాజు, నారి పిన్ని నూకరాజు పాల్గొన్నారు

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -గాజువాక : చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. వి డెంటల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని, పాఠశాలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. వి డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ ఎం.హరికిషోర్ మాట్లాడుతూ దంత సమస్యలున్నారికి హాస్పిటల్‌లో ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ దంతాల సంరక్షణతోనే మనిషి ఆరోగ్యం ముడిపడి ఉంటుందన్నారు. నోటి దుర్వాసన, రోగాలు రాకుండా దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.. శిబిరంలో దంతవైద్యులు డాక్టర్.ఎ మణికుమారి, డాక్టర్ డి ఆదిత్య సిబ్బంది వరలక్ష్మి, సువర్ణ, సునీతఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివేకానంద సేవలు అభినందనీయం



సుధాకర్‌ను అభినందిస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-సీతమ్మధార : వివేకానంద స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని దక్షిణ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ కొనియాడారు. బుధవారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ, ఘోషాసుపత్రికి దూరం ప్రాంతం నుంచి వస్తున్న రోగులు, వారి సహాయకులు వివేకానంద సేవా సంస్థ నిత్యం భోజనాలను అందిస్తుండడం, సంస్థలో నిత్యాన్నదానం, ఇతర సేవాకార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. వివేకానంద సేవా సంస్థకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వివేకానంద సంస్థ అధ్యక్షులు అప్పారావు, సంస్థ సభ్యులు పి.ఈశ్వరరావు, యు.ఎల్లాజీ , కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో మౌలిక వసతులు కల్పించండి



కూటమి నేతలకు వినతిపత్రం ఇస్తున్న వర్తకులు

ప్రజాశక్తి -మధురవాడ :రుషికొండ బీచ్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే, సందర్శకులను ఆహ్వానించేలా మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని పోలమాంబ చిల్లర వర్తకుల సంఘం ప్రతినిధులు కోరారు. బుధవారం బీచ్ వద్ద నిర్వహించిన సంఘం సమావేశానికి కూటమి పార్టీల నేతలు8వ వార్డు టిడిపి అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన అధ్యక్షులు శాఖరి శ్రీనుబాబు తదితరులను ఆహ్వానించి, తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వర్తకుల సంఘం అధ్యక్షుడు బడే కోదండరావు మాట్లాడుతూ అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడానికి బ్లూఫ్లాగ్ స్టేటస్ కలిగిన రుషికొండ బీచ్‌లో వర్తకులకు శాశ్వత దుకాణాలతోపాటు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని, సందర్శకులను ఆహ్వానించేలా సుందరీకరించాలని, కోరారు. గత ప్రభుత్వహయాంలో నిర్లక్ష్యానికి గురైన రుషికొండ బీచ్ అందాలు, ప్రస్తుత కూటమి పాలనలోనైనా ఆకర్షనీయంగా తీర్చిదిద్ది, తమ జీవనోపాధికి ఆసరానివ్వాలని వేడుకున్నారు.ఈ మేరకు కూటమి నేతలకు వినతిపత్రం అందించారు. దీనిపై కూటమి నేతలు స్పందిస్తూ, రుషికొండ బీచ్ సమస్యలు, అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతోపాటు మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళతామని భరోసానిచ్చారు. బిజెపి అధ్యక్షులు నాగ రాజు, జనసేన నేత సీరం ధనరత్నం, టీడీపీ నాయకులు ధనరాజు, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతుబజారు ఎస్టేటు అధికారిపై విచారణ

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్ నిర్వహణలో నిర్లక్ష్యంతోపాటు ఎస్టేట్ అధికారి కొండబాబుపై పలు ఆరోపణలు చేస్తూ ఎస్ అప్పారావు వినియోగదారుడు ఆర్‌డిఒకుఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం అధికారులు విచారణ జరిపారు.ఆర్‌డిఒ ఆదేశాలతో సీతమ్మధార తహశీల్దార్ శ్రీరామమూర్తి, డిటి త్రినాధరావు, మార్కెటింగ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు బృందంగా సీతమ్మధారను రైతుబజారును సందర్శించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సంఖ్య, రైతుబజారులో ఉన్న స్టాల్స్, వాటికి రైతులు చెల్లిస్తున్న అద్దెలు, ఎస్టేట్ అధికారి వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై ఆరా తీశారు. రైతుబజారులోని బోర్డులకు, వాస్తవంగా ఎంత ధరకు కూరగాయలను విక్రయిస్తున్నదీ కొనుగోలుదారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ, అందిన ఫిర్యాదు మేరకు ఆర్‌డిఒ ఆదేశాలతో విచారణకు వచ్చామని, వివరాలను ఆర్‌డిఒకు నివేదిస్తామన్నారు.

ఉక్కుపై అసత్య ఆరోపణలు తగదు

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ, ప్రజలను అయోమయం తప్పుదోవ పట్టించడం తగదని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నం బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఒక ఆంగ్ల పత్రికలో కథనాలు వెలువడడం హేయమన్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, స్టీల్‌ప్లాంట్‌పై. తెలుగుదేశం ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని, ఉక్కు ప్రైవేటీకరణను ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదన్నారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖకు వస్తున్న నేపథ్యంలో ఇటువంటి అసత్య వార్తలు తప్పుడు సంకేతాలు ఇస్తాయన్నారు. మొన్నటిదాకా మాజీ ముఖ్యమంత్రి జగన్ కంపెనీలో పనిచేసిన వ్యక్తి, నేడు ఆ ఆంగ్ల దినపత్రికలో చేరిన నేపథ్యంలో ఆయన ప్రోద్బలంతోనే ఇటువంటి తప్పుడు కథనాలు వచ్చినట్లు భావిస్తున్నామని, దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో యూటర్న్ తీసుకునే ప్రసక్తే లేదని, టిడిపి వైఖరి స్పష్టంగా ఉందని మరోసారి వెల్లడించారు. 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్. ఉన్నారు.

డయేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -ఆనందపురం : పరిసరాల పరిశుభ్రత, దోమలు నిర్మూలనతో సీజనల్ వ్యాధులు దరిచేరవని జల్ జీవన్ మిషన్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఎం ఆనంద్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్టాఫ్ డయేరియాపై జల్‌జీవన మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే, ముందుగా మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోపాటు చేతులు కడుక్కోవడం ద్వారా వ్యక్తిగత శుభ్రత కూడా పాటించాలన్నారు. ఈ సందర్భంగా డయేరియా లక్షణాలు, ఈ వ్యాధి ప్రబలడానికి కారణాలను వివరిస్తూ, నిర్మూలనా చర్యలపై ప్రజల్లో అవగాహనకు నినాదాలు చేస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ నల్లారి అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి రామారావు, హెచ్‌ఎం కెఆర్‌కె.పట్నాయక్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి -ఆనందపురం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు బుధవారం గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యాప్రవేశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకునే వయసున్న పిల్లలను పనులకు పంపించడం చట్టరీత్యా నేరమన్నారు. .కార్యక్రమంలో ఎఎంఒ లక్ష్మీ, హెచ్‌ఎం ఎల్ఎస్ఎన్ పాత్రుడు, సిఆర్‌ఎంటి గౌంతిన శివాజీ, బంక దుర్గ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి- అనకాపల్లి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అనకాపల్లి కార్మిక శాఖ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎం. రమణ, కెవి కృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటివరకు కార్మిక శాఖ కార్యాలయం నుండి ఎటువంటి క్లైములు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఆర్థిక సహాయం ఉండేటట్టు, తక్షణ సహాయం అందేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక సంక్షేమ బోర్డు నుండి వందల కోట్ల రూపాయలను గత ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలకు మళ్లించి భవననిర్మాణ కార్మికులు మాత్రం మొండి చేయి చూపించిందని విమర్శించారు. కరోనా వ్యాధి విజృంభిస్తున్న సమయంలో కూడా భవన నిర్మాణ కార్మికులకు ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదని పేర్కొన్నారు. 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంక్షేమ కార్యాలయంలో లేబర్ కార్డును పొందుటకు చెప్పులు అరిగిపోయేలా తిరగాల్సి వస్తుందని, దాని వలన పనులు కోల్పోయి ఆర్థిక భారం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కసింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి కార్మికులు రాము, గోవిందు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకం

నల్సార్ వర్సిటీ ఆచార్యులు కేశవరావు

ప్రజాశక్తి-సబ్బవరం

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకమైనదని నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్, డిఎస్ఎన్ఎల్‌యు మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.కేశవరావు అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కేశవరావు మాట్లాడుతూ దేశంలో అనేక న్యాయ విద్యాలయాలు, కాలేజీలు, ప్రైవేట్ సంస్థలు న్యాయ విద్యను అందిస్తున్నాయని, వాటన్నింటిలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న విద్య ఎంతో భిన్నమైనదని తెలిపారు. మూట్ కోర్టులలో పాల్గొనడం, ప్రాజెక్ట్ లాంటివి చేయడం, డిబేట్లు, వివిధ రకాలైన అభ్యాసనాల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు అందులో పాలుపంచుకోవడం ద్వారా ఎంతో పరిణితి సాధిస్తారని తెలిపారు. విద్యార్థులు తన లక్ష్యం అడ్వకేట్, కార్పొరేట్ రంగం, జ్యూడిషియరీ అనేది ముందుగానే నిర్ణయించుకోవాలని, ఆ దిశగా ఈ ఐదు సంవత్సరాలు అధ్యయనం కొనసాగించాలని సూచించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ లా అధ్యయనం అనేది ఒక ఉన్నతమైన చదువు అని, భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగం తయారు చేసి దానిలో న్యాయవాదుల పాత్ర ఎంతో గొప్పదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ సోమా భట్టాచార్య, డీన్ డాక్టర్ కె.సుధ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య కేశవరావు


జెట్టీ ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

జెట్టీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడకలో నూతనంగా నిర్మించ తలపెట్టిన జెట్టీ నిర్మాణ పనులను బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూడిమడక తీరంలో ఆయన పర్యటించారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చేయాల్సిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంబంధిత అధికారులు రాష్ట్ర కేంద్ర నాయకులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపిడివో సురేష్ కుమార్, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు బి.రాందాస్, టిడిపి మండల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, పూడి మెరుగు బాపు నాయుడు, గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని, ఆర్బి కుమార్, ఎం త్రివేణి, ఎం.ప్రవీణ్, ఎన్‌డిఎ కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

అస్వస్థకు గురైన వారికి సిపిఎం నేతల పరామర్శ

మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్


రోగులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు శంకర్, శ్రీను, రాజు తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి

నక్కపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిపిటాక్సిం ఇంజెక్షన్ వికటించి తీవ్రమైన అస్వస్థకు గురైన 23 మంది రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను బుధవారం సిపిఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలైన్ బాటిల్ ఇంజెక్షన్ చేసిన తరువాత ఒకే రకమైన తీవ్రమైన చలి జ్వరంతో పాటు వణుకుతో కూడిన లక్షణంతో బాధపడి అస్వస్థకు గురైన రోగులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి మంగళవారం రాత్రి తరలించినట్లు చెప్పారు. నక్కపల్లి ఆసుపత్రిలో రోగులకు చేసిన ఇంజెక్షన్ సెలైన్ బాటిల్స్ వినియోగాన్ని తక్షణమే నిలిపివేసి వాటి పనితీరుపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రోగులు పూర్తిస్థాయి ఆరోగ్యం కుదురుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో అతిసార, డయేరియా జ్వరాలతో బాధపడుతున్న రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతుందని, సబ్ సెంటర్స్ స్థాయిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, సీనియర్ నాయకులు నగిరెడ్డి సత్యనారాయణ, పాంగి చలపతి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడపు నాయుడు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 25 మంది పట్టుబడ్డారు. వీరిని అనకాపల్లి 13వ ఎం.ఎం కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా జడ్జ్ బివి.విజయలక్ష్మి వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.2,50,000 జరిమానా విధించారు. అనకాపల్లి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ట్రిపుల్ రైడింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులు 63 కేసు నమోదు చేసి, రూ.6,800 జరిమానా విధించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని, లేకుంటే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పైడపు నాయుడు హెచ్చరించారు.

మంచినీటి పథకం చుట్టూ తుప్పలు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ తుమ్మపాల గ్రామంలోని తుమ్మపాల వీధి అంబేద్కర్ నగర్లో ఉన్న మంచినీటి పథకం చుట్టూ ఉన్న తుప్పలను బుధవారం తొలగించారు. ఇక్కడ సులాబ్ కాంప్లెక్స్, మంచినీటి పథకం పక్క పక్కనే ఉండడం, సులాబ్ కాంప్లెక్స్ శిథిల స్థితికి చేరడంతో మంచి నీటి పథకం చుట్టూ ఉన్న తుప్పల్లోనే బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. దీనిపై ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి స్పందించిన పంచాయితీ అధికారులు మంచి నీటి పథకం చుట్టూ ఉన్న తుప్పలను డొంకలను బుధవారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. మంచి నీటి పథకాన్ని శుభ్రం చేయడం బ్లీచింగ్ కలపడం తోపాటు సులాబ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు, రన్నింగ్ వాటర్, దారి ఏర్పాటు చేయడం వంటి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇవి పూర్తయితే ఈ ప్రాంత మహిళల మరుగుదొడ్డి ఇక్కట్లు తీరనున్నాయి.


ట్యాంకు చుట్టూ తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెం జివిఎంసి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్, షూ, టెక్ట్స్‌బుక్స్, యూనిఫామ్, బెల్ట్ అన్నీ కలిసిన స్టూడెంట్స్ కిట్స్‌ను ఎన్‌డిఎ కూటమి నాయకులు మళ్ల సురేంద్ర, కొణతాల అప్పలరాజు, విల్లూరి హరి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి, భవితకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలను సాధించుకొని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసి, వెంకట్, కూటమి నాయకులు పీలా రాముడు, కాంగ్రెస్‌గుల జోగేంద్ర, పొలమరశెట్టి చందు, పెంటకోట శివరాం, బుద్ధ భూలోక నాయుడు, పిడి ప్రసాద్, బుద్ధ జోగు నాయుడు, జొన్నాడ సురేష్ పాల్గొన్నారు.

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

ప్రజాశక్తి-చోడవరం : వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణంతో ప్రాణాలు కాపాడుకోవాలని న్యాయవాదులు అన్నారు. చోడవరంలో బుధవారం న్యాయవాదులు చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులతో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని న్యాయమూర్తి రత్న కుమార్ ప్రారంభించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి. హెల్మెట్ ధరించు ప్రాణాలు కాపాడుకో అని నినాదాలు చేసుకుంటూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తులు, లాయర్లు తదితరులు

ఫార్మా వ్యర్థ రసాయనక

డ్రమ్ములు డంపింగ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడలోని బచ్చల బంధం చెరువులోని సోమవారం ఫార్మా వ్యర్థ రసాయనాలతో కూడిన సుమారు 50 డ్రమ్ములను డంపింగ్ చేసిన సంఘనటపై సమగ్ర విచారణ చేసి, ఆయా కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌టియు ప్రధాన కార్యదర్శి బొడ్డపు చిన్నారావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ వ్యర్థ రసాయనాల వల్ల ఈ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో రసాయన వాయువులు పీల్చలేక స్థానికులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా యాజమాన్యాలు బరితెగించి వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాంకీ యాజమాన్యం చెక్ పోస్ట్‌ల వద్ద సక్రమంగా చెకింగ్ లేకుండా పంపించడం వల్ల కొంతమంది తుక్కు దుకాణాలకు డంపింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఫార్మా వ్యర్థ రసాయనాలు డంపింగ్ చేయడం వల్ల వాయు కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు కాలుష్యితమవుతున్నాయని తెలిపారు. కెమికల్ డ్రమ్ములు తెచ్చిన వాహనాల మీద కూడా క్రిమినల్ కేసులు పెట్టాలని, గెడ్డ వాగులో రసాయనిక వ్యర్థాలు జలాలు వదలడంపై రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.



రికవరీ చేసిన సెల్‌ఫోన్లు చూపుతున్న బాధితులు

రూ.2 లక్షల విలువైన సెల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి, నర్సీపట్నం రోడ్, తుని, అన్నవరం రైల్వే స్టేషన్లలో దొంగిలించబడిన రూ.2 లక్షల విలువైన రూ.8 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి వాటి సొంతదారులకు బుధవారం అప్పగించడం జరిగిందని తుని జిఆర్‌పి పోలీసులు తెలిపారు. రికవరీ చేసిన మొబైల్స్‌ను రాజమండ్రి డిఎస్‌పి మోహనరావు ఆధ్వర్యంలో కాకినాడ లైన్ ఇనస్పెక్టర్ గౌస్‌బెగ్ సమక్షంలో అందజేశారు. రికవరీలో సబ్ ఇనస్పెక్టర్ షేక్ అబ్దుల్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఆంపూటర్ ఆపరేటర్ రామకోటి, బెహరా ప్రసాద్, ఆర్‌పిఎఫ్ సతీష్, పాల్గొని తమ సేవలు అందించారని వారిని డిఎస్‌పి అభినందించారు. మొబైల్ రికవరీ చేసినందుకు వినియోగదారులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన 'టీచ్ టూల్' శిక్షణ

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. తొమ్మిది రోజులు పాటు జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మండలాల నుండి 96 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరంతా సర్టిఫైడ్ అబ్జర్వర్‌లుగా ఉత్తీర్ణత సాధించారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఐవి.రామిరెడ్డి అధ్యక్షతన ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ అందించారు. చోడవరం విద్యాశాఖాధికారులు జయలక్ష్మి, సింహాచలం, కోర్సు డైరెక్టర్‌ను, మాస్టర్ ట్రైనీలు జగన్నాధరావు,ఉదయ్ భాస్కర్, బొంజిబాబు, సముద్రం, కుమార్ సతీష్‌లను ఉపాధ్యాయులు అభినందించారు.

తామరబ్బలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలో తామరబ్బ గ్రామంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యాన కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు శెట్టి మంగరాజు మాట్లాడుతూ వర్షాకాలం రావటంతో ప్రజలు అనారోగ్యాలకు గురవకుండా, విషజ్వరాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ పైడ్రాజు, నాయకులు మొసలి తమ్మయ్య, దెబ్బరి రాజబాబు, జడ్డేటి రాజు, కదరాజు ప్రసాదు, జుత్తాడ దేవుడు, మొసలి చంటి, మూలగుమ్మి విజయ్, కడారి శ్రీను, దురియ సత్యం, జడ్డేటి రాము, పోతుబంది రాజు, కోసూరి రవి, ఈశ్వరరావు, తేడా చిన్నారావు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద ఖరీఫ్ పంటలపై రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి ఎ.శ్రీధర్ మాట్లాడుతూ రైతులు మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేయాలన్నారు. వ్యవసాయ శాఖ సంచాలకులు విజేత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కశింకోట వ్యవసాయ శాఖ అధికారి స్వప్న, మాకవరపాలెం వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్.చిరంజీవి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఎడి శ్రీధర్

విద్యుత్ షాక్‌తో 'సెయింట్ గోబిన్' కార్మికుడు మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌లోని సెయింట్ గోబిన్ పరిశ్రమ క్యాంటీన్లో అసిస్టెంట్ కుక్‌గా పనిచేస్తున్న కులదీప్ సింగ్ సెజ్ కాలనీ జంగాలపాలెంలో తను నివాసముంటున్న ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు బుధవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్ ఫిరోజాబాద్ ప్రాంతానికి చెందిన కులదీప్ సింగ్ సెజ్ కాలనీ జంగాల పాలెంలో తను నివాసం ఉంటున్న ఇంట్లో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురై నేలపై పడిపోయాడు. దీంతో కులదీప్‌సింగ్‌ను ఆయన అత్త, అన్నయ్య వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే కులదీప్ సింగ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై లేక్ రాజ్ అనే కార్మికుడు బుధవారం ఉదయం 10 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

కులదీప్ సింగ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి : సిఐటియు

కులదీప్ సింగ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వలస కార్మికులు నివసిస్తున్న ఎస్ఇజెడ్ కాలనీ జంగాలపాలెం గ్రామంలో ఆయన అనుమానాస్పదంగా మృతి చెందాడని రాము తెలిపారు. వలస కార్మికుడు మృతిపై విచారణ జరిపి ఆయన కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వలస కార్మికుల చట్ట ప్రకారం పని చేస్తున్న కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని రక్షణ కల్పించాలని కోరారు.



కులదీప్ సింగ్ మృతదేహం

అంగన్వాడీల సమస్యలపై ధర్నా



ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- అనకాపల్లి

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు సిడిపిఒకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్టు అధ్యక్షులు అమ్మాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలకు బడ్జెట్లో నిధులు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. మినీ, మెయిన్ ప్రమోషన్లు ఇవ్వాలని గత ప్రభుత్వ కాలంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు ఉమా, నారాయణమ్మ, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

12 నుండి టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో జన శిక్షణా సంస్థాన్ సహకారంతో ఈనెల 12 నుండి టైలరింగ్, బ్యూటీషియన్ (బ్యూటీ కేర్), డేటా ఎంట్రీ ఆపరేటర్ (కంప్యూటర్) శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రారంభిస్తారన్నారు. అనంతరం 2023 డిసెంబర్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు జరిగిన టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ విభాగాల్లో శిక్షణ పొందిన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు హాజరు కాదలచిన వారు శ్రీగౌరీ గ్రంథాలయంలో పేర్లు నమోదు చేయించుకుని ఆధార్ కార్డు, ఒక పాస్ ఫోటో అందజేయాలని సూచించారు. బయోమెట్రిక్ హాజరుతో జరుగు ఒక్కొక్క కోర్సు శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని, శిక్షణ పూర్తైన అనంతరం సర్టిఫికేట్లు అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 92471 66511, 92471 87355 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

కాశీపురంలో గ్రామసభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం పంచాయతీలో సమస్యలపై సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని వివిధ సమస్యలపై అధికారులతో చర్చించారు. ముఖ్యంగా గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, రైతుల పంట పొలాల కాలువలు, డ్రైనేజీ వ్యవస్థపై చర్చించారు. గ్రామంలో ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్ర పటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేసిన నేపథ్యంలో మండలంలోని రైవాడ పంచాయతీలో బుధవారం భవన నిర్మాణ కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చల్ల నానాజీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక అధిక రేట్లకు అమ్మడంతో పేదలు భవన నిర్మాణ పనులు చేయకపోవటంతో పనులు లేక కార్మికులు చాలా ఇబ్బందులు గురయ్యారని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక పాలసీ కారణంగా కార్మికులకు నిత్యం పనులు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఉపాధ్యక్షులు దుక్క ఈశ్వరరావు, కార్మికులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పచ్చి మేతతో అధికంగా పాల దిగుబడి

ప్రజాశక్తి-అనకాపల్లి : పాడి పశువులకు పచ్చి మేత పెట్టడం ద్వారా అధిక మొత్తంలో పాల దిగుబడి వచ్చి రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుందని పశు వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ అనిల్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తుమ్మపాల, సత్యనారాయణపురం గ్రామాల రైతు సేవా కేంద్రాల పరిధిలో పాడి రైతులకు పచ్చి మేత ప్రాముఖ్యతను వివరించారు. శాస్త్రీయ పద్ధతిలో పశుగ్రాసాలను పెంచుకునే విధానాన్ని, పచ్చి మేతలో పోషకాల విలువల పట్ల అవగాహన కల్పించారు. పాడి రైతులకు 75శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలను, నేపియర్ గడ్డి ముచ్చులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏ వెంకట్, కావ్య, రమణ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులకు పచ్చి మేతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కసింకోట పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్స్ జార్జ్ మాట్లాడుతూ మొక్కజొన్న, అలసందలు, హైబ్రిడ్ నేపియర్ పిల్లి పెసర వంటి పశుగ్రాసాలను పెంచుకోవాలని సూచించారు. కాకి జొన్న విత్తనాలు ఐదు కేజీల రూ.460 కాగా సబ్సిడీపై రైతులకు రూ.115కు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శనివాడ అరుణ, ఎంపిటిసి రాము, ఎన్‌డిఎ కూటమి నాయకులు పందల నాయుడు, సగరపు నాయుడు, మేడిది నాయుడు, కె రమణ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పశు సంవర్ధకశాఖ అధికారులు

సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పశు గ్రాసం సాగు శాస్త్రీయ విధానాలు పశుగ్రాసం నిల్వలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సబ్బవరం పశువైద్యశాల సహాయ సంచాలకులు ఉషా కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగులలో పశుగ్రాస వారోత్సవాలను బుధవారం ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మరిడిమాంబ కాలనీలో పాడి రైతులకు పశుగ్రాసాల సాగు, రకాలు, ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, పాడి రైతులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పునర్నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : తుమ్మపాల మేజర్ గ్రామ పంచాయతీ ఇందిరానగర్ (ఎస్సీ కాలనీ)లో కళ్యాణ మండపం పునర్నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ప్రారంభించారు. ఈ కల్యాణ మండపం గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరుకుంది. పైప్ లైన్, నీటి సరఫరా, తాగునీటి సరఫరా, మండపం సీలింగు, మరుగుదొడ్లు లేని కారణంగా ఈ మండపం వినియోగంలో లేదు. కళ్యాణ మండపం రిన్నోవేషన్ చేపట్టేందుకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబుకు దరఖాస్తు చేయడంతో ఇందుకు రూ.10 లక్షలు ఎంపిపి నిధులు విడుదల చేశారు. దీంతో బుధవారం గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులు ఎలక్షన్ ముందు రావడం, ఎలక్షన్ కోడ్ వల్ల వెంటనే ప్రారంభించలేకపోయామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ బంగారు వెంకటేశ్వరరావు, ఎంపిటిసి వడ్డాది భారతి అశోక్, వార్డు మెంబర్లు రవ్వ భవాని శ్రీను, తత్రా సత్యారావు, ముత్యాల అప్పారావు, కోన గాంధీ, కోన దుర్గ, కసింకోట అప్పలకొండ, బంగారు పోతురాజు, బంగారు అప్పారావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- అనకాపల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం జిల్లా పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, ఎస్పి కెవి.మురళీకృష్ణతో కలసి మంత్రి ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా శాఖలకు సంబంధించి అప్పగించిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బారికేడ్స్ ఏర్పాట్లు తదితర విషయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్.రాయవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు సర్వం సిద్ధం చేశామని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం మధ్యాహ్నం దార్లపూడి గ్రామంలో జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఆమె హెలిప్యాడ్, పోలవరం ఎడమ కాలువల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. దార్లపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెలిప్యాడ్‌ను అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. పూర్తి శిథిలావస్థలో ఉన్న నర్సీపట్నం-రేవుపోలవరం రోడ్డును దార్లపూడి హైస్కూలు నుండి పోలవరం ఎడమ కాలువ వరకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు.

విశాఖపట్టణం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. పోలీస్ కమిషనర్ ఎస్.బాగ్చి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, ఇతర అధికారులతో కలిసి మెడ్ టెక్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ క్రమంలో మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు, ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించనున్న ప్రధాన మీటింగ్ హాలు, వర్చువల్ విధానంలో జరిగే సిఐఐ సదస్సుకు సంబంధించిన హాలును పరిశీలించారు.

అనకాపల్లి జిల్లా పర్యటన అనంతరం హెలికాప్టర్ ద్వారా గురువారం మధ్యాహ్నం 1.50 గంటలకు మెడ్ టెక్ జోన్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రి చేరుకోనున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను కూడా కలెక్టర్ పరిశీలించారు.

హెూం మంత్రి అనిత



ఎస్.రాయవరంలో పరిశీలిస్తున్న అనిత



నిలిపివేసిన పనులు

ప్రభుత్వ భూమిలో చదును పనులు

- నిలిపి వేసిన అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా ప్రభుత్వ భూమిని చదును చేయడాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే పనులు నిలిపివేసి, భూమి చదునుకు వినియోగించిన మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో గొలుగొండ పంచాయతీ శివారు కొత్త జోగంపేటలో హై స్కూల్ కి సమీపంలో ఉన్న ప్రభుత్వ కొండ భాగంలో జోగంపేటకు చెందిన కొంతమంది బుధవారం భూమి చదును చేపట్టారు. ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలు గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు స్థానిక విఆర్ఓ రాజుబాబును సంఘటన స్థలానికి పంపించారు. ప్రభుత్వ స్థలంలో ఎటువంటి పనులు చేపట్టరాదని భూమి చదును చేస్తున్న రైతులకు హెచ్చరికలు జారీ చేసి పనులు నిలిపివేసి చదును చేస్తున్న మిషన్ ను స్వాధీనం చేసుకున్నారు. తమకు ఆ భూమికి సంబంధించి డీ పట్టాలు ప్రభుత్వం ఇచ్చిందని ఆక్రమణ రైతులు చెప్పగా సంబంధిత రికార్డులు తీసుకుని రెవెన్యూ కార్యాలయానికి రావాలని, అప్పటివరకు ఎటువంటి పనులు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వీఆర్వో హెచ్చరించారు.

పాఠశాలను తనిఖీ చేసిన డిఇఒ

ప్రజాశక్తి- నాతవరం :మండలంలోని చమ్మచింత జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థులు పాఠశాల మానకుండా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. హిమోగ్లోబిన్ టాబ్లెట్లు ఇచ్చేలా చూడాలని సూచించారు.. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, బట్టలను, బ్యాగులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి పి.అప్పారావు, నాతవరం ఎంఈఓ కామిరెడ్డి వరహాలబాబు, ప్రధానోపాధ్యాయులు కాశపు శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిఇఒ

పాయకరావుపేట నియోజకవర్గ సమస్యలను ..

సిఎం చంద్రబాబు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గం ఎస్ రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువను పరిశీలించేందుకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్న సందర్భంలో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. మూసివేసిన ఏటి కొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి, ఆధునీకరణించి నడిపించాలని, కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న బకాయి వేతనాలు, పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలన్నారు. తాండవ, వరహా నదులకు ఇరువైపులా పటిష్టంగా గేట్లు నిర్మించాలని, నక్కపల్లి లో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, నక్కపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కి స్వంత భవనాలు నిర్మించాలన్నారు. ఎస్.రాయవరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసి, భవనాలు నిర్మించాలని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, పాలిటెక్నిక్ కాలేజీ లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలంలో ఉద్దండపురం వద్ద పైలెట్ వాటర్ ప్రాజెక్టు పూర్తి చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని, నక్కపల్లి మండలంలో రాజయ్యపేట సముద్రతీరంలో హెటిరో డ్రగ్స్ కంపెనీ మత్స్యకారులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా అక్రమంగా వేసిన పైపులైన్ తొలగించాలన్నారు. కోటవురట్ల మండలం జల్లూరు, ఎండపల్లి గ్రామాలు మధ్య పందూరు, రామచంద్రపురం గ్రామాల మధ్య వరహా నదిపై బ్రిడ్జిలు వెంటనే పూర్తి చేయాలన్నారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ 2023 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ, మెరుగైన పునరావాసం, ఎన్ఎటిపి నిర్వాసితులు ప్యాకేజీ చెల్లించాలని, కోటవురట్ల మండలం లో అణుకు, కోదండరాం పురం,తడపర్తి, బోణీ కొత్తూరు గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలరాజు



పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు

స్టూడెంట్ కిట్స్ పరిశీలన

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాల, మండల స్టాక్ పాయింట్‌లో స్టూడెంట్ కిట్స్‌ను బుధవారం విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు ఇస్మాయిల్ పరిశీలించారు. విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేశారా లేదా అని ఆరా తీశారు. యూనిఫారం క్లాత్‌లను పరిశీలించి, ఒక్కొక్క విద్యార్థికి 3 జతలు చొప్పున డ్రెస్సులు కుట్టే విధానం గురించి వివరించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది కంటే పెరిగిన విద్యార్థులను చూసి హెచ్ఎం సుధారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కే.నరేష్ పాల్గొన్నారు .

ఆక్రమణదారులకు నోటీసులివ్వండి

ఆయుకట్టు రైతుల డిమాండ్

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట ముంతమామిడి కట్టు వ్యవసాయ కాలువను ఆక్రమించి నిర్మిస్తున్న వలు నిర్మాణాల పై కల్యాణపులోవ జలాశయం ఏఈ సత్యనారాయణదొర, మండల సర్వేయర్ సత్యనారాయణ, గ్రామ సర్వేయర్ శ్రీను, విఆర్ఓ లక్ష్మి, తదితరుల అధికారుల బృందం బుధవారం ఆయుకట్టు రైతుల సమక్షంలో కాలువ గట్టు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ సత్యనారాయణ మాట్లాడుతూ, ఆ కాలువ గట్టు పరిసరాలు గ్రామ కంఠం 244 సర్వే నెంబర్‌లో ఉందన్నారు.. కాలువ నిర్మాణానికి 10 అడుగులతో పాటు కాలువ గట్టు పై రోడ్డు నిర్మాణానికి మరో 11అడుగులు స్థలం అవసరమని, అందుకు తగిన విధంగా మార్కింగ్ ఇవ్వాలని ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర చెప్పడంతో ఆ మేరకు మార్కింగ్ ఇచ్చారు. కొంతమంది ఆక్రమణలు చేపట్టడంతో పంచాయతీ తీర్మానం చేసి వారందరికీ నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కన్నంపేట, కొత్తకోట రైతులు కలం నర్సిం గరాజు, కోట సత్యనారాయణ, బంటు శ్రీను, గేదల శ్రీరామమూర్తి తదితరులు పంచాయతీ సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ దేవా కార్యదర్శిలకు వినతిపత్రం అందించారు...



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

విద్యార్థులకు సక్రమంగా భోజనం పెట్టకుంటే..

'ఇళ్లకు తీసుకు వెళ్లిపోతాం'

ప్రజాశక్తి -చీడికాడ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాలీచాలని, ఉడికి ఉడకని అన్నం పెట్టడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారని, ఇలా అయితే తమ ఇళ్లకు తీసుకెళ్లిపోతామని తల్లిదండ్రులు తెలిపారు. నాణ్యమైన భోజనం అందించని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే తమ పిల్లలను పాఠశాల నుండి ఇళ్లకు తీసుకుపోక తప్పదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను నిలదీశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఉడికి ఉడకని అన్నం, నీళ్ల చారు పెడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు చాలీచాలని భోజనం పెట్టి మిగిలిన భోజనం, కూరలు ఇళ్లకు పట్టుకుపోతున్నారని ఆరోపించారు. ఇష్టముంటే తినండి లేకపోతే వెళ్లిపోండి అంటూ మండిపడుతున్నారని, దీంతో భోజనానికి వెళ్లలేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సమస్యపై అధికారులు పట్టించుకోకపోవడంతోనే విద్యార్థులు అర్ధాకులతో అలమటిస్తూ విద్యా బోధన కొనసాగిస్తున్నారని వాపోయారు. ఈ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు..

ఈ సమస్యపై మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బొంజు బాబును ఫోన్లో సంప్రదించగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని నిర్వాహకులను హెచ్చరించడం జరిగిందని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో కొత్తమల్లంపేట, పప్పుశెట్టిపాలెం పంచాయతీ సుద్దలపాలెం, పాత మల్లంపేట పంచాయతీ శివారు బుడ్డడపాడు గ్రామాల్లో గొలుగొండ పిహెచ్సి వైద్యాధికారులు శ్యామ్, కీర్తిల ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డెంగ్యూ, డయేరియాలపై గ్రామస్తులకు వైద్యాధికారి శ్యామ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్యామ్

వైద్యులపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై తక్షణ చర్యలు చేపట్టాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా 23 మంది ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురయ్యారన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వైద్యులపై క్షేత్ర సాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి కోరారు.

ఎపిజివిబి మేనేజర్‌గా మహేశ్వరరావు

ప్రజాశక్తి-రోలుగుంట: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్‌గా పప్పల మహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నందినిషాహు పదోన్నతిపై శ్రీకాకుళం జిల్లా ఆర్ఓ ఆఫీస్ ఎడ్మిన్‌గా బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పినపంకి గ్రామంలో పని చేసిన ఆయన రోలుగుంట బ్యాంకుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోలుగుంట బ్యాంక్‌లో 70 కోట్లు టర్నోవర్ అవుతుందని, రైతులు, మహిళలు, డిపాజిట్లు చేసిన వారు మొత్తం 1200 మంది కస్టమర్లు ఉన్నారన్నారు. బంగారం, హౌసింగ్‌పై రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రైతులు క్రాప్ రుణాలు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని ఆయన చెప్పారు.



కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

-సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్స్ డే



భీమిలిలో చేపడుతున్న మానవహారం

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై సిఐటియు అఖిలభారత కమిటీ పిలుపు మేరకు బుధవారం డిమాండ్స్ డేలో విశాఖ, అనకాపల్లిలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని కార్మికులు, నాయకులు నినాదాలు చేశారు.

కశింకోట : సిఐటియు. ఆధ్వర్యంలో స్థానిక బజారు తహాశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు టి.తనూజ, కె.శాంతి, కె.నాగరాజు, సాయిరాం, మణి పాల్గొన్నారు.

యలమంచిలి : సిఐటియు ఆధ్వర్యంలో యలమంచిలిలో ర్యాలీ నిర్వహించి ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డిటికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సోమునాయుడు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కర్రి అప్పారావు, పలు రంగాల నాయకులు శశికళ, సోమలక్ష్మి, బుజ్జిగోపి, కనక, అప్పలరాజు, రమణమ్మ, నర్సింహులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేసి తహాశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, నాయకులు బిటి.దొర, పలు రంగాల నాయకులు జి వరలక్ష్మి, పద్మ, వి గౌరి, అరుణశ్రీ, టి. అప్పారావు లీలా, రవణమ్మ పాల్గొన్నారు.

చోడవరం : సిఐటియు ఆధ్వర్యాన చోడవరం మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేశారు. అలాగే ఎంఆర్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్వీ నాయుడు, మిడ్డే మీల్స్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి, పలు యూనియన్ల నాయకులు కె.వరలక్ష్మి, బొద్దాన రామలక్ష్మి, సూర్యకాంతం, కొండమ్మ, కాంతం, దేవి పాల్గొన్నారు.

పరవాడ : సిఐటియు ఆధ్వర్యాన స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి, ఎంఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, పలు యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, కె.రమణి, ఎ.వరలక్ష్మి, ఎం.ఉమామహేశ్వరి, ఆర్ శంకర్, రవణమ్మ ఐద్వా నాయకులు మాణిక్యం పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు ధర్నా చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక తహాశీల్దారు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. దీనికి ముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మండల కార్యదర్శి కె సోమినాయుడు, పలు యూనియన్ నాయకులు జయ, నారాయణమ్మ, రమణ, వెంకటలక్ష్మి, సరోజినీ, మంగమ్మ, నర్సింగరావు సత్యనారాయణ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్థానిక తహసీల్దార్‌కు కోర్కెల దినం సందర్భంగా వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి.సాంబశివరావు, పలు సంఘాల నాయకులు ఆది వరలక్ష్మి, జె.వెంకటలక్ష్మి, చిలుకమ్మ, శనివాడ లక్ష్మి పాల్గొన్నారు.



మాడుగులలో..

కె.కోటపాడు : స్థానిక తహాశీల్దారు కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. డిటికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గండి నాయన బాబు, శేషు, ఎర్ర దేవుడు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

నక్కపల్లి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిఐటియు జిల్లా కమిటీ నాయకురాలు దుర్గారాణి డిమాండ్ చేశారు. బుధవారం కోర్కెల డిమాండ్ డే సందర్భంగా నక్కపల్లి తహసిల్దార్, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డిటి చైన్లు, ఏవో సీతారామరాజు లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజేష్, సుబ్బలక్ష్మి, నాగమణి, సత్యనారాయణ, నారాయణ రావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు త్రిమూర్తుల రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సిపిఎం అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వాలు ఎన్ని మారినా కార్మికుల జీవితాల్లో ఏ మాత్రం మార్పు కూడా రాలేదన్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు.అంగన్వాడి జిల్లా కార్యదర్శి ఎం.మంగతాయి, గొలుగొండ అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షరాలు సిహెచ్. భ్రమరాంబ, నాయకులు రొంగలి సత్య, కే.భవాని, జ్యోతి పాల్గొన్నారు. రైతు సంఘం నాయకులు నారాయణమూర్తి సంఘీభావం తెలియజేశారు.



నర్సీపట్నంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఎస్.రాయవరం: మండలం కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విఓఏ ల యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రూపా దేవి, రాజేష్, రమణ, సత్యవతి పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక గాంధీ పార్క్ నుండి తహశీల్దార్ కార్యాలయంం వరకు ప్రజా సంఘాల అద్వర్యంలో ర్యాలీ ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మయ్య కు సిఐటియు మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వరలక్ష్మి, కొండాజి వినతిపత్రం సమర్పించారు. వి.ఓ.ఏ.ల యూనియన్. ప్రెసిడెంట్ భత్తుల గంగాభవాని, సెక్రెటరీ గొల్లూరి జగదీశ్వరి, పంచాయతీ కార్మికుల యూనియన్ ఈశ్వరరావు, తాతయ్యబాబు, ముఠా కార్మికుల యూనియన్ ప్రెసిడెంట్ పైడినాయుడు పాల్గొన్నారు.



అనకాపల్లిలో మాట్లాడుతున్న శంకరరావు

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్కీమ్ వర్కర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ,ఆశా, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ, ఆర్‌పి, ఎన్‌హెచ్‌ఎం, ఎస్ఎస్ఎ తదితర స్కీమ్స్‌లో పనిచేస్తున్న వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని నినదించారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ, ఆర్‌పి, నేషనల్ హెల్త్ మిషన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో స్కీమ్ వర్కర్ల నాయకులు ఎం.వెంకటలక్ష్మి, శోభ, వి.మేరీ, వై.సీతారత్నం, కె.కళచందన, డి.వరలక్ష్మి, ఎం.నిర్మల, ఎస్‌పి కాళీ, సుజాత, దయాన, పద్మ, స్వాతి, సత్యవతి, నూకరత్నం, కృప తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ ఆసుపత్రి వద్ద ప్రొటెస్ట్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపి చంద్రమౌళి, నూకరాజు, నాయుడు, బాల, వేలగాని పాల్గొన్నారు.

జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి ఆధ్వర్యాన జివిఎంసి వెటర్నరీ విభాగం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రావణ కుమార్, పి.రాజశేఖర్, జనార్ధన్, రమణ, ముని, శివ తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల భద్రత కోసం సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి డిమాండ్ చేశారు. టౌన్ కొత్త రోడ్డు, పూర్ణా మార్కెట్ వద్ద డిమాండ్స్ డే నిర్వహించారు. ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : చైనా వాల్తేరులోని ప్రభుత్వ ఛాతి ఆసుపత్రి వద్ద విమ్స్ హాస్పిటల్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు డిమాండ్స్ డే సందర్భంగా నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని నినదించారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరేంద్రకుమార్, డి.రాజేశ్వరి, వై.కనకరాజు, అన్నపూర్ణ, సింధుషా, సిహెచ్.పార్వతమ్మ పాల్గొన్నారు.

ఆరిలోవ : జూ పార్కులో 15 ఏళ్ళుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం నెలకు రూ 26 వేలు చెల్లింపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సిఐటియు డిమాండ్స్‌డే పిలుపు మేరకు జూవద్ద కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసి, తర్వాత ఈ వ్యవస్థను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.నరేంద్రకుమార్, యూనియన్ నాయకులు నరేష్, రాజు, నర్సింగరావు, పైడిరాజు పాల్గొన్నారు.

విమ్స్ కార్మికుల వేతనాలు పెంచాలని **విమ్స్ ఆసుపత్రి వద్ద** కాంట్రాక్ట్ కార్మికులు నిరసన చేపట్టారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు, వి.నరేంద్రకుమార్, డి.రాజేశ్వరి, వై.కనకరాజు, అన్నపూర్ణ, సింధుషా, సి.హెచ్.పార్వతమ్మ పాల్గొన్నారు.

గాజువాక : వడ్లపూడి రైల్వే వేగన్ వర్క్ షాప్ వద్ద యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రాంబాబు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. పర్మినెంట్ కార్మికులకు రూ.70వేలు పైబడి చెల్లిస్తున్న యాజమాన్యం, కాంట్రాక్టు కార్మికులకు రూ.15వేలు కూడాఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వి రాజు, కె. అవతారం, వెంకటేశ్వరరావు, సతీష్, సురేష్ ఎం రాజు పాల్గొన్నారు.

భెల్ మెయిన్ గేటు వద్ద అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలోడిమాండ్స్‌డే సందర్భంగా నిరసన చేపట్టారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి, జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, కేంద్రం దూకుడు నుంచి భెల్‌ను రక్షించుకుందామ న్నారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ సాప, ఇంటక్ ప్రధాన కార్యదర్శి, వి బాబురావు, పివిఎన్ రాజు, ఎస్ జగన్నాధరావు, కె.దేవుడు, వి ఆనందరావు, సీత నాయుడు, డి నరసింహారావు,పాల్గొన్నారు.

మధురవాడ: జివిఎంసి 6,7వ వార్డు కార్యాలయాల వద్ద సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు జోన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ రామప్పుడు, సిహెచ్ శేషుబాబు,ఉపాధ్యక్షులు డి అప్పలరాజు, కార్యకర్తలు బి రాంబాబు, వి గోవిందు, బి నర్సయ్యమ్మ, డి సూరిబాబు, కే అర్జునమ్మ, బి అప్పారావు ఆర్ రవి, పాల్గొన్నారు.

పెందుర్తి : తహశీల్దార్ కార్యాలయం వద్ద అసంఘటిత కార్మికులు, స్కీం వర్కర్లు డిమాండ్స్‌డే నిరసన చేపట్టారు. అంగన్వాడీవర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి మణి మాట్లాడు తూ ఎన్నికలలో హామీ మేరకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. నిరసనలో ప్రధాన కార్యదర్శి ఎల్ .దేవి, గౌరవ సలహాదారులు బృంద, చిన్నమ్మలు,.కళ, ఆశ యూనియన్ అధ్యక్షులు పద్మ, విఒఎ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీలక్ష్మి, మధ్యాహ్నం భోజనం యూనియన్ అధ్యక్షులు వరహాలమ్మ, వరలక్ష్మి సిఐటియు జిల్లా కార్యదర్శి బి జగన్, పెందుర్తి జోన్ కార్యదర్శి ఎస్ శంకరరావు పాల్గొన్నారు.



గాజువాకలో...

సీతమ్మధార : సిఐటియు అక్కయ్యపాలెం జోన్‌లో కార్యదర్శి ఎన్ ప్రకాశరావు, నాయకులు అప్పలరాజు నాయకత్వాన డిమాండ్స్‌డే నిరసన చేపట్టారు. కార్మికులు పాల్గొన్నారు.

ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు ఆద్వర్యంలో హెచ్‌పిసియల్ లేబరు గేట్ వద్ద, శ్రీహరిపురం వార్డు కార్యాలయం వద్ద కె.రమణ అధ్యక్షతన డిమాండ్స్‌డే నిరసన చేపట్టారు. జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, జోన్ నాయుకులు పి.పైడిరాజు, హెచ్ పిసియల్ కాంట్రాక్టు వర్క్స యూనియన్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.కృష్ణారావు, జి.నరేష్, బి.శ్రీనివాస్, రాజు నీలయ్య, ఏసుబాబు, అర్జునరావు, రామకృష్ణ, సత్తిబాబు, హరి, రాము, రాంబాబు ఆదినారాయణ, తిరుపతిరావు, సూరిబాబు దేవి లక్ష్మి అప్పలకొండ దుర్గ రాజేశ్వరి పాల్గొన్నారు.

తగరపువలస : డిమాండ్స్ డే సందర్భంగా సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుంచి జ్యూట్ కార్మికవాడ మీదుగా జంక్షన్‌కు ర్యాలీ, మానవ హారం నిర్వహించారు.యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, పలుసంఘాల కార్మికులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : ఎన్ఏడి కొత్తరోడ్డు వద్ద సిఐటియు డిమాండ్స్‌డే సందర్భంగా గోపాలపట్నం సిఐటియు నాయకుడు బలివాడ వెంకటరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు పి అనసూయ సిఐటియు నాయకులు ముద్దాడ వరప్రసాద్ మల్లేష్ పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్కీమ్ వర్కర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ,ఆశా, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ, ఆర్‌పి, ఎన్‌హెచ్‌ఎం, ఎస్ఎస్ఎ తదితర స్కీమ్స్‌లో పనిచేస్తున్న వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని నినదించారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, విఒఎ, ఆర్‌పి, నేషనల్ హెల్త్ మిషన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. స్కీమ్ వర్కర్ల నాయకులు ఎం.వెంకటలక్ష్మి, శోభ, వి.మేరీ, వై.సీతారత్నం, కె.కళచందన, డి.వరలక్ష్మి, ఎం.నిర్మల, ఎస్‌పి కాళీ, సుజాత, దయాన, పద్మ, స్వాతి, సత్యవతి పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ ఆసుపత్రి వద్ద ప్రొటెస్ట్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపి చంద్రమౌళి, నూకరాజు, నాయుడు, బాల, వేలగాని పాల్గొన్నారు.

జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి ఆధ్వర్యాన జివిఎంసి వెటర్నరీ విభాగం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రావణ కుమార్, పి.రాజశేఖర్, జనార్ధన్, రమణ, ముని, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : చైనా వాల్తేరులోని ప్రభుత్వ ఛాతి ఆసుపత్రి వద్ద విమ్స్ హాస్పిటల్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు డిమాండ్స్ డే సందర్భంగా నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని నినదించారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడారు. నరేంద్రకుమార్, డి.రాజేశ్వరి, వై.కనకరాజు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో..